# 'లియారూ, శాంతిదేవి

సింగవేలు మొదలియారు చాలా మంచివాడు. దైవభక్తీ, పెద్దమీసాలూ, సమృద్ధిగా ఉన్నవాడు. మదరాసులో ట్రాములు బతికున్నరోజుల్లో రాయపేటలో కాలేజీ విద్యార్థులకోసం వసతి గృహాన్ని నడిపేవాడు. ఆ లాడ్జి ఎప్పుడూ కన్నులపండువుగా ఉండేది, వెనకటి వైకుంఠంలాగ. అవిభక్త మదరాసు రాష్ట్రపు వైవిధ్యమంతా అక్కడ ప్రతిఫలించేది. కేకలూ, ఈలలూ, ఊళలూ, చప్పట్లూ వేస్తూ శ్రద్ధగా చదువుకునేవాళ్ళనూ చదువుకోనివాళ్ళనూకూడా అసలు చదువుకోకుండాచేసి విద్యపై యుద్ధాన్ని ప్రకటించిన వీరాధివీరులు ఎందరో ఉండేవారు. ఉదయాలు భక్తిగీతాలూ, మధ్యాహ్నాలు అనంతశయనాలూ, సాయంకాలాలు ఏకపాత్రాభినయాలూ, రాత్రిళ్లు చక్రభ్రమణాలూ—ఇదీ అక్కడ వరస.

ఆ లాడ్జిలోనే ఓ గదిలో సింగవేలు మొదలియారు ఉండేవాడు. కుర్రాళ్ళ అల్లరి చూసీ చూడనట్లు అధివాస్తవిక మొహంపెట్టి అందరికీ తల్లో నాలికమల్లే ఉండేవాడు (బుగ్గలో నాలికతనం కాదు). ఇలా ఉంటూంటూంటూండగా ఒక దుర్ముహూర్తాన మొదలియారుకు జబ్బుచేసింది. డాక్టర్ వచ్చి విశ్రాంతి కావాలనీ, ఏదైనా పల్లెటూళ్ళో ఓ ఆరు వారాలు ఉండడం మంచిదనీ అన్నాడు. మొదలియార్ని ఎంతో బలవంతం చేస్తే చివరకు "గాకారం" అనే చిన్నపల్లెలో ఉన్న మేనల్లుడింటికి వెళ్లాడు.

'లియారు వెళ్ళేముందు మేమంతా ఎన్నో వాగ్దానాలు

గోపాల చక్రవర్తి

చేసాం. చెలియలికట్ట దాటమనీ, గోడలు దూకమనీ, రోజూ ప్రొద్దున్న లేవగానే 'లియారి పేరు అరచేతిలో రాసుకుని మిగతా పనులు చేస్తామనీ ఎట్‌సెటరా. 'లియారు మా భక్తికి సంతోషించి టాక్సీ ఎక్కాడు. మొదలియార్ వెళ్ళాక మా లాడ్జిలో తొలిసారిగా చీరలు అక్కడక్కడ కన్పించాయని కిట్టనివాళ్లు అన్నారు. కాని నేను త్వరగా పడుకుని ఆలస్యంగా లేచే అలవాటు వున్నవాణ్ణవడంచేత ఈ సంగతి నాకు తెలియదు. రెండు రోజులు గడిచాయో లేదో, ఓ ప్రభాతవేళ మొదలియారు ఊడిపడ్డాడు గాలిపడగలా. అంతా ఆయన చుట్టూ గుమిగూడి "అప్పుడే వొచ్చావారేం" అన్నాం గద్గదికంగా. మొదలియారు శాక్యసింహుడిలా ("భారతి" రెవ్యూయర్ కాదు) మొహం పెట్టి అన్నాడు. "ఆ పల్లెటూళ్ళో శబ్దాలు భరించలేను. పిట్టల అరుపులూ, ఆవుల అంబాలూ ఎంతసేపని వినగలను? మన పట్టణాల్లో వుండే ప్రశాంత వాతావరణం అక్కడ ఉండదు." మేం కాదనలేదు. పోర్టికోలోకి వచ్చి కిందకు చూశాం. ట్రాములూ, బస్సులూ, టాక్సీలూ పరిగెడుతున్నాయి. పక్క గదిలో టెలిఫోను మోగుతోంది. మేడకింద కొళాయిలో నీళ్లు బకెట్‌లో పడుతున్నాయి. "ఆహా! నగరజీవితంలో ఎంత ప్రశాంతి" అనుకున్నాం.

*నీతి : కొందరికి పట్టణాలే బాగుంటాయి.*

